@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
FOCUS TELUGU TV అనునిత్యం - ప్రజాపక్షం
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | మంగళవారం 11, మార్చి 2025 | పేజీలు: 04



## 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- తొలిరోజు గవర్నర్ ప్రసంగం
- అధికారులతో సమీక్షించిన సిఎస్ శాంతికుమారి

2



## ప్రణయ్ హత్య కేసులో సంచలన తీర్పు

- సుభాష్‌శర్మకు ఉరిశిక్ష..
- మిగిలిన వారికి యావజ్జీవ శిక్ష విధించిన నల్గొండ కోర్టు

2



## నా జీవితం తెలంగాణకే అంకితం

- ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చినందుకు హైకమాండ్‌కు ధన్యవాదాలు
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయశాంతి

2

## రాష్ట్రం కోసం అవసరమైతే ఢిల్లీలో

# కొట్లాడతం..



### 39 కాదు.. 99 సార్లు హస్తినకు వెళ్తా..

- ప్రాజెక్టులకు అడ్డుగా రాష్ట్ర బీజేపీ నేతలు
- కేసీఆర్‌కు బలుపు తప్ప ఇంకేముంది?
- కేసీఆర్ పాలన అప్పులు.. తప్పులు
- కిషన్ రెడ్డి చర్చకు సిద్ధం కావాలి
- మూసీకి నిధులు తెస్తే కిషన్ రెడ్డికి సన్మానం చేస్తా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 10:

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుండుసున్నా రావటానికి తానే కారణమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విమర్శలతో దాడి చేశారు. కేసీఆర్‌ను ఓడించి.. సీఎం కుర్చీలో నుంచి దింపింది తానే అన్నారు రేవంత్. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుండు సున్నా వచ్చిందంటే కారణం తానేనని కేటీఆర్ గుర్తించాలని చెప్పారు. స్టేటస్ గురించి కేటీఆర్ మాట్లాడుతున్నారు.. అసలు కేటీఆర్ ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు? అని ప్రశ్నించారు. అధికారం పోయిందనే అక్కసుతో కేటీఆర్ మాట్లాడుతున్నారు. కేసీఆర్‌ది అసెంబ్లీకి వచ్చే స్థాయి కాదన్నారు. క్రిమినల్స్ ఎప్పుడూ కేసులకు భయపడరు. కేసులకు భయపడితే క్రైమ్ చేయరు. అందుకే కేటీఆర్ భయపడను అంటున్నారంటూ రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేటీఆర్ గురించి మాట్లాడడం కూడా అనవసరం అంటూ ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డి నేనే మెట్రో తెచ్చానంటున్నారు.. కిషన్‌రెడ్డి తెచ్చిన (మిగతా 2లో..)





## ఎమ్మెల్యే కోటా ఎంఎల్‌సికి నామినేషన్

- నామినేషన్లు వేసిన విజయశాంతి తదితరులు
- సిపిఐ నుంచి నెల్లికంటి సత్యం నామినేషన్
- బిఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన దాసోజ్ శ్రవణ్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 10:

ఎమ్మెల్యేల కోటాలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఆ పార్టీ నేతలు విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అట్టహాసంగా నామినేషన్ల కార్యక్రమం సాగింది. వీరికి సిఎం సహా మంత్రులు సంతకాలు చేశారు. మరోవైపు సీపీఐ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం నామపత్రాలు దాఖలు చేశారు. సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శాసనసభలో ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి కాంగ్రెస్‌కు 4, భారాసకు ఒకటి దక్కనున్నాయి. తమకు వచ్చే నాలుగులో ఒక సీటును పొత్తు ధర్మం (మిగతా 2లో..)

## రేవంత్ రెడ్డికి ఢిల్లీలో నడుస్తలేదు

- వేలకోట్ల రూపాయల టీడీఆర్ స్కామ్‌కి కుట్ర
- బడ్జెట్ తర్వాత ఫార్ములా-ఈ డ్రామా
- రేవంత్ రెడ్డి వెనక నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఉన్నారు
- టీడీఆర్ స్కాంపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- 15 నెలలుగా బీజేపీ మౌనం.. బీఆర్ఎస్ పోరాటం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 10:

రేవంత్‌రెడ్డికి ఢిల్లీలో పనిపోయిందని.. అక్కడ ఎవరూ రేవంత్‌రెడ్డిని ఖాతరు చేయడం లేదని.. ఆయన గురించి తెలిసినందువల్లే రాహుల్‌గాంధీ కోవర్టుల టాపిక్ తీసుకొచ్చారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ సోమవారం ఉదయం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్ , హరీష్ రావు పాల్గొన్నారు. అనంతరం కేటీఆర్ మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. దాసోజు శ్రవణ్‌ను గతంలోనే టీఆర్ఎస్ ప్రతిపాదించిందని.. 2023లో అప్పుడు బీజేపీ ఆపిందన్నారు. ఆయన గతంలో టీఆర్ఎస్‌ను వీడకపోతే ఎప్పుడో ఎమ్మెల్సీ అయ్యేవారని అన్నారు. పట్టుబట్టి బీజేపీ ఆపిందని... ఇప్పుడు వారు ఆపినప్పటికీ దాసోజుకు బీఆర్ఎస్ అవకాశం ఇచ్చిందని మాజీ మంత్రి అన్నారు. రేవంత్ రెడ్డిది ఢిల్లీలో ఏమీ నడుస్తలేదన్నారు. సాక్షాత్తు రాహుల్ గాంధీ గుజరాత్‌లో రేవంత్‌ను ఉద్దేశించి తమ పార్టీలో బీజేపీకి (మిగతా 2లో..)





## అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ హరీశ్ రావు

- మహిళా సంఘాలకు వేల కోట్ల బకాయి
- మహిళా సంఘాల వడ్డీల చెల్లింపులో బీఆర్ఎస్ మోసం
- అభయహస్తం నిధుల దుర్వినియోగం
- మంత్రి సీతక్క

2



## వెండితెరపైకి జగ్గారెడ్డి

- నేను ఎవరి సింపతీ మీద రాజకీయాల్లోకి రాలేదు
- రాజకీయంగా ఫైట్ చేస్తా..
- త్వరలో సినిమాల్లో నటిస్తున్నానని ప్రకటన

2

## వరంగల్‌లో లక్ష ఎకరాల్లో ఎండిన పంటలు!

- దేవాదుల నీటిని విడుదల చేయకుండా తాత్సారం
- చెరువులు నింపి నీరివ్వడంలో రేవంత్ సర్కార్ విఫలం
- మీడియా సమావేశంలో హరీష్ రావు విమర్శలు

2



# వెండితెరపైకి జగ్గారెడ్డి

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 10:

తాను సింపతీ మీద రాజకీయాల్లోకి రాలేదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. సోమవారం ఢిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... రాజకీయాల్లో ఫైట్ చేస్తానని.. త్వరలో సినిమాల్లోకి రానున్నట్లు ప్రకటించారు. అతి త్వరలో ఒక ప్రేమ కథ చిత్రంలో ప్రత్యేక పాత్ర పోషించనున్నట్లు ఆఫ్ ది రికార్డ్‌లో ఆయన వెల్లడించారు. సినిమాలో మాఫియాను ఎదురించి ఆడపిల్ల పెళ్ళి చేసే వ్యక్తి అతనే జగ్గారెడ్డి అని అన్నారు. ఈ మధ్య కాలంలో ఓ వ్యక్తి తన దగ్గరకు వచ్చి ఒక కథ ఉంది అని చెప్పారన్నారు. 'ఆ కథలో మీ పాత్ర ఉందని అన్నారు. ఆ సినిమాలో నటిస్తా అని చెప్పాను. ఈ కథలో నా ఒరిజినల్ క్యారక్టర్ కూడా ఉండబోతుంది. ఈ ఉగాదికి సినిమా కథ విని.. వచ్చే ఉగాదికి సినిమా పూర్తి చేస్తాం. పీసీసీ, సీఎం అనుమతి తీసుకొని నటిస్తాను' అని వెల్లడించారు. ఇక సినిమా పేరును కూడా ప్రకటించేశారు జగ్గారెడ్డి. అదే 'జగ్గారెడ్డి...వార్ ఆఫ్ లవ్' అనే టైటిల్‌ను ఖారారు చేసినట్లు తెలిపారు. ఇక రాజకీయ అంశాలపై మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక చూసి మైండ్ బ్లాక్ అయిందన్నారు. తాను రాజకీయంగా షాక్‌లో ఉన్నట్లు తెలిపారు. తన షాక్‌కు కాలం సమాధానం చెబుతుందన్నారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు జట్టి కుసుమ అని తెలిపారు. అనుకోకుండా ఢిల్లీకి తెలంగాణ నుంచి నేతలు రాలేదన్నారు. 2017లో రాహుల్ గాంధీ సంగారెడ్డి సభను తానే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాటి కష్టాలు పరిణామాలు చెప్పాలని అనుకున్నానని.. దానిపై రాహుల్ గాంధీని కలిసేందుకు ఢిల్లీకి వచ్చినట్లు వెల్లడించారు. రాహుల్ గాంధీని సమయం అడిగానని అన్నారు. కుసుమకు ఎమ్మెల్సీ ఇవ్వాలని పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, డిప్యూటీసీఎం భట్టి విక్రమార్కకు చెప్పానన్నారు. తాను ఢిల్లీకి వచ్చి కుసుమ అంశం మాట్లాడాలని అనుకున్నానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ అంశాన్ని ముందే చెప్పినట్లు తెలిపారు. తాను ఢిల్లీకి వచ్చినప్పుడు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ,కేసీ వేణుగోపాల్ లేరని అన్నారు.

# 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 10:

ఈ నెల 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ జిజష్టుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. 13న గవర్నర్ ప్రసంగంపై చర్చ ఉంటుంది. 14న హోలీ సెలవు కారణంగా అసెంబ్లీకి కూడా సెలవు. 15న గవర్ర్ ప్రసంగానికి సిఎం రేవంత్ సమాధానం ఇస్తారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న సందర్భంగా రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో సమీక్షిస్తూ, గౌరవ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలని, అసెంబ్లీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. బ్జడెట్ సెషన్‌లో సరైన సమాచారం అందించేందుకు సంబంధిత కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని, శాఖల వారీగా నోడల్ అధికారులను కూడా నియమించుకోవాలని సి.ఎస్ అన్నారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనున్నందున, వివిధ శాఖల వారీగా పూర్తి వివరాలతో అధికారులు సన్నద్ధం కావాలని సి.ఎస్ పేర్కొన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, జయేష్ రంజన్, రవి గుప్తా, ముఖ్య కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, శైలజా రామయ్యర్, సంజయ్ కుమార్, దాన కిషోర్, శ్రీధర్, ఎస్.ఎ.యం. రిజ్వీ, కార్యదర్శులు యోగితా రాణా, లోకేష్ కుమార్, క్రిస్టినా జెడ్ చోంగ్తు, బుద్ధ ప్రకాష్ జ్యోతి, రఘునందన్ రావు, అనితా రామచంద్రన్, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# నా జీవితం తెలంగాణకే అంకితం

హైదరాబాద్ ప్రతినిధి, (తొలి క్రాంతి)-మార్చ్10:

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత విజయశాంతి వెల్లడించిన ప్రకారం, గతంలో పార్టీ అధిష్ఠానం తనకు అవకాశం ఇచ్చినా, తాను అప్పటి పరిస్థితుల మేరకు ముందుగా పని చేయాలని భావించి ఆ అవకాశాన్ని తీసుకోలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో తనకు మంచి అనుభవం ఉందని, కానీ ఏ పదవి కోసం ప్రత్యేకంగా కోరుకోలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మాట్లాడుతూ, గతంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని అధికారం నుంచి తొలగించడమే తన లక్ష్యంగా ఉంచుకున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు తాను మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. పార్టీ అధిష్ఠానం ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటుందో ఎవరికీ ముందుగా తెలియదని, అయితే పార్టీ నాయకత్వం అవసరమైనప్పుడు, సరైన సమయంలో బాధ్యతలు అప్పగిస్తుందని వ్యాఖ్యానించారు. పార్టీలో పదవులు రాని వారు ఓర్పుగా పనిచేయాలని సూచించారు. తనకు అవకాశం వచ్చిన తర్వాతే మాట్లాడాలని నిర్ణయించుకున్నానని, అప్పటి వరకు క్రమశిక్షణగా పని చేస్తూనే ఉన్నానని విజయశాంతి అన్నారు. ఇంతకాలం ఎదురు చూసిన అవకాశం ఇప్పుడు లభించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఒక విధాన పరమైన వ్యవస్థ ఉంటుందని, అందరూ ఆ విధంగా పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రణాళికాబద్ధంగా రూపొందించి అమలు చేస్తోందని వివరించారు.

# అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 10:

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాలకు చెల్లించాల్సిన వేల కోట్ల రూపాయల వడ్డీలను బకాయిపెట్టి మోసం చేసిన చరిత్ర హరీశ్ రావు మర్చిపోవద్దని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి ఆర్థిక శాఖ మంత్రిగా హరీశ్ రావు మహిళా సంఘాల హక్కులను తుంగలో తొక్కారని ఆరోపించారు. సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, గత ఐదేళ్లలో మహిళా సంఘాలకు రూ.3,485 కోట్లు వడ్డీ చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.409 కోట్లు మాత్రమే చెల్లించారని పేర్కొన్నారు. మిగతా మొత్తాన్ని ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల్ని మోసం చేసిందని ధ్వజమెత్తారు. మహిళా సంఘాల బ్యాంకు రుణాలకు వడ్డీలు చెల్లించడం లేదన్న హరీశ్ రావు వ్యాఖ్యలపై ఆమె తీవ్రంగా స్పందించారు. "మూడేళ్ల పాటు ఒక్క పైసా కూడా విడుదల చేయకుండా మహిళా సంఘాలకు గుండు సున్నా పెట్టిన హరీశ్ రావు, ఇప్పుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు," అని మంత్రి సీతక్క మండిపడ్డారు. ఇటీవల జరిగిన మహిళా సభ విజయవంతం కావడంతో కడుపుమంటతో హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వడ్డీ లేని రుణాలు అందించడం లేదా, మహిళలకు ఉపాధి కల్పించడం చేయని బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు మోసలి కన్నీరు కారుస్తోందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ పాలనలో మహిళా సంక్షేమం కేవలం కవితకే పరిమితమైందని, రాష్ట్రంలోని ఇతర మహిళలకు ఎలాంటి మేలు చేయలేదని మంత్రి సీతక్క అన్నారు. బతుకమ్మ, బీసీ ఉద్యమం, మహిళా ఉద్యమం %-% ఏదైనా కార్యక్రమాన్ని కవితే హైజాక్ చేసేవారని, ఇతర మహిళలకు అవకాశమివ్వలేదని ఆరోపించారు. "మహిళా సంఘాల డబ్బును బీఆర్ఎస్ ప్రభుత్వం తక్కువచేసింది. కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వడ్డీలను పూర్తిగా చెల్లించాం. ఈ ఏడాది కూడా అదే విధంగా చెల్లింపు ప్రక్రియ కొనసాగుతోంది," అని మంత్రి వెల్లడించారు.

## రాష్ట్రం కోసం అవసరమైతే ఢిల్లీలో

# కొట్లాడతం..

(మొదటి పేజీ తరువాయి..)

మెట్రో ఎక్కడుంది? అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. తెలంగాణకు కిషన్‌రెడ్డి నిధులుతెస్తే సన్మానం చేస్తానని చెప్పారు. కనీసం అఖిలపక్ష భేటీకి కిషన్‌రెడ్డి రాలేదని రేవంత్ విమర్శించారు. కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి నిధులు తెస్తే వద్దంటామా..? అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. రింగ్ రోడ్డు అంటే రింగ్ ఉండాలి కదా.. మరి సగం ఇచ్చి రింగ్ అని ఎలా అంటారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర సమస్యలపై ఉమ్మడి పోరాటం కోసం అఖిలపక్షం పెడితే బీజేపీ వాళ్లు రాలేదు.. కేసీఆర్ ఏమైనా అంటారనే కిషన్ రెడ్డి ఆ సమావేశానికి రాలేదేమో అని సీఎం రేవంత్ అన్నారు. అన్ని రాష్ట్రాలను బీజేపీ సమానంగా చూడటం లేదని సీఎం రేవంత్ ఆరోపించారు. బుల్లెట్ ట్రైన్ గుజరాత్ ఇచ్చారు.. తెలంగాణ ఎందుకు ఇవ్వడం లేదని రేవంత్ ప్రశ్నించారు. తెలంగాణ కడుతున్న పన్నులు ఎంత .. తిరిగి కేంద్రం కేటాయించిన నిధులు ఎంత..? చర్చకు వస్తానంటే సీఎంగా తాను, భట్టి చర్చకు రావడానికి సిద్ధమని కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం 99 సార్లయినా ఢిల్లీ వెళ్తానని చెప్పారు.



తాను ఢిల్లీకి వెళ్లడం వల్లనే హైదరాబాద్‌లో అభివృద్ధి కావాల్సిన క్లియరెన్స్ వచ్చిందని రేవంత్ చెప్పారు. పట్టభద్రుల ఎన్నికల్లో అసలు పోటీ చేయకుండా తప్పించుకున్నది బీఆర్ఎస్ కాదా..? అని రేవంత్ ప్రశ్నించారు. హరీశ్ రావు లాంటి వాళ్ళు దొంగ దెబ్బ తీశారని సీఎం చిట్‌చాట్‌లో కామెంట్ చేశారు. మందకృష్ణ మాటలు బీజేపీ మాటలుగా కొట్టిపడేశారు. ఏపీలో అసలు వర్గీకరణే మొదలుకాలేదని తిప్పికొట్టారు. గతంలోనే పూర్తిచేసి ఉంటే ప్రమాదం జరిగేదికాదు.. చావులను కూడా రాజకీయాలకు వాడుకుంటున్నారని రేవంత్ విమర్శించారు.



## రేవంత్‌రెడ్డికి ఢిల్లీలో

# నడుస్తలేదు

(మొదటి పేజీ తరువాయి..)

కోవర్టులు ఉన్నారని అన్నారన్నారు. రేవంత్ జుట్టు ఢిల్లీలో ఉందని.. ఆయన స్థానంలో ఎవరు ఉన్నా అదే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. స్ట్రాంగ్ లీడర్లను బీజేపీ, కాంగ్రెస్ ఎదగనివ్వదని విమర్శించారు. ఇప్పటికీ మంత్రివర్గ విస్తరణ లేదన్నారు. రేవంత్ రెడ్డికి అంత ఉంటే ముందు కేబినెట్ విస్తరణ చేసేవారన్నారు. 39 సార్లు ఢిల్లీకి ఫ్లైట్ ఎక్కడం దిగడం తప్ప చేసింది ఏం లేదని విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి చుట్టూ నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఉన్నారని కామెంట్స్ చేశారు. వారి సహకారంతో డబ్బులు భారీగా సంపాదిస్తున్నారని ఆరోపించారు. టీడీఆర్ పేరిట రేవంత్ రెడ్డి భారీ కుంభ కోణానికి తెర లేపబోతున్నారని.. వెంటనే దీనిమీద శ్వేతా పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 1947 నుంచి దేశ చరిత్రలో ఇప్పటివరకు ఏ సీఎం ఇంత స్థాయిలో డబ్బులు సంపాదించడం తెలియదేమో అంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రైవేట్ వ్యక్తుల దోపిడీ పెరిగి ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందన్నారు. ఇండియా టుడే సదస్సులో రేవంత్ రెడ్డి దివాళాకోరుతనం బయట పెట్టుకున్నారని మండిపడ్డారు. ఈ బడ్జెట్ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతారని అన్నారు. గవర్నర్ అడ్రెస్ కార్యక్రమంలో కూడా అటెండ్ అవుతారని తెలిపారు. రేవంత్ స్థాయికి తాము చాలన్నారు. 'ఒక లీడర్‌గా , మాజీ మంత్రిగా, కేసీఆర్ బిడ్డగా, ఆయన అభిమానిగా.. నా వ్యక్తిగత అభిప్రాయం మేరకు ఈ చిల్లర గాళ్ళ ముందుకు రావాల్సిన అవసరం లేదు. కేసీఆర్ వస్తారా లేదా అన్నది ఆయన వ్యక్తిగతం' అని చెప్పుకొచ్చారు. త్వరలో తెలంగాణాలో పది ఉప ఎన్నికలు రాబోతున్నాయని సంచలన ప్రకటన చేశారు. తమకు ఈ మేరకు సమాచారం ఉందన్నారు. అందులో భాగంగానే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉన్నామన్నారు. బీజేపీ సోషల్ మీడియాలో ఎక్కువ.. సొసైటీలో తక్కువ అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణాలో ఆర్ఆర్‌టాక్స్ నడుస్తోందన్న మోడీ ఎందుకు విచారణ చేయలేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిమీద మోడీకి ఎందుకు అంత ప్రేమ అని నిలదీశారు. కిషన్ రెడ్డి నిస్సహాయుడన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై తమ పార్టీ పునరాలోచనలో పడిందని కేటీఆర్ పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య రహస్య ఒప్పందం ఉందని, రేవంత్ రెడ్డి బీజేపీ కోవర్టుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.

# లక్ష ఎకరాల్లో ఎండిన పంటలు



జనగామ, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 10:

ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డికి పాలన చేతకాక ప్రకృతిపై, ప్రతిపక్షాలపై నిందలు వేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. నీరందక ఎండిన పంటలకు ఎకరాకు 20వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ఎండల వల్ల పంటలు ఎండిపోతుంటే కేసీఆర్, హరీశ్‌రావు సంతోషపడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఎండలు కొట్టాయని.. కానీ ఆనాడు పంటలు ఎందుకు ఎండలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ రోజే ఎందుకు ఎండిపోతున్నాయని నిలదీశారు. కేసీఆర్ పాలనలో మండుటెండల్లో కూడా వాగులు, వంకలు, చెరువుల్లో నీళ్లు ఉండేవని.. ఒక్క ఎకరం కూడా ఎండకుండా పండిందని గుర్తు చేశారు. పాలన చేతగాక ప్రకృతిపై, ప్రతిపక్షాలపై నిందలు వేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు అని విమర్శించారు. దేవాదుల ఓ అండ్ ఎం కాంట్రాక్టర్‌కు రూ.7వేల కోట్ల బిల్లులు చెల్లించక పోవడం వల్ల 33 రోజులపాటు పంపుల మోటర్లు ఆన్ చేయలేదని హరీశ్‌రావు తెలిపారు. 33 రోజులు దేవాదుల పంపుల మోటార్లు ఆన్ చేసి ఉంటే రిజర్వాయర్లు నిండేవని.. పొలాలకు నీళ్లు వచ్చేవని తెలిపారు. రేవంత్ రెడ్డి చేసిన తప్పును ప్రకృతి మీద మోపి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నీళ్లు ఇవ్వద్దని మోటార్లకు అడ్డంగా హరీశ్ రావు, బీఆర్ఎస్ నాయకులు నిల్చున్నారా అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఫైనాన్స్‌లో బిల్లులు ఇవ్వాలంటే 20 శాతం కమీషన్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో భూములకు క్లియరెన్స్ ఇవ్వాలంటే 20 శాతం కమిషన్, మున్సిపల్ డిపార్ట్‌మెంట్‌లకు, గేటెడ్ కమ్యూనిటీలకు పర్మిషన్ ఇవ్వాలంటే 20 శాతం కమీషన్ అని ఇవ్వాలని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే వరంగల్ జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. ఈసారి ప్రకృతి కనికరించిందని.. పోయినసారి కంటే సమృద్ధిగా వర్షాలు కురిశాయని పేర్కొన్నారు. వేలాది టీఎంసీల నీళ్లు గోదావరిలో కలిశాయని చెప్పారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చుక్క చుక్కను ఒడిసిపట్టాడని.. రేవంత్ రెడ్డి ఏమో నీళ్లను వృథాగా వదిలిపెడుతున్నాడని విమర్శించారు. గోదావరిలో ప్రవాహం ప్రారంభమైందని తెలవగానే మోటర్లు ఆన్ చేసి రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నింపి ఉండాల్సిందని హరీశ్‌రావు అన్నారు. సకాలంలో ఓ అండ్ ఎం పనులు పూర్తిచేసుకుని ఎండాకాలం కోసం నీళ్లు సిద్ధం చేసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు.



# ప్రణయ్ హత్య కేసులో సంచలన తీర్పు

హైదరాబాద్/నల్గొండ, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 10:

రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మిర్యాలగూడ పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసులో తుది తీర్పును సోమవారం నల్లగొండ కోర్టు వెల్లడించింది. ఏ2 సుభాష్ శర్మకు ఉరిశిక్ష విధిస్తూ న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. నిందితులు అందరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ఎస్సీ, ఎస్టీ సెషన్స్ రెండో అదనపు న్యాయ స్థానం కీలక తీర్పు వెలువరించింది. 302, 120 ఐపీసీ, 109, 1989 సెక్షన్ ఐపీసీ ఇండియన్ ఇండియన్ ఆర్మ్ యాక్ట్ 1959 ప్రకారం శిక్ష విధించింది. శిక్ష తగ్గించాలని న్యాయమూర్తిని ఈ సందర్భంగా నేరస్తులు వేడుకున్నారు. హార్ట్ పెషేంట్, కుటుంబ సభ్యుల ఆరోగ్యం, చిన్న పిల్లలు ఉన్నారని కొందరు నేరస్తులు న్యాయ స్థానానికి తెలిపారు. ఉగ్రవాది అస్గర్ అలీకి సుపారీ.. అయితే ఏ2 సుభాష్ శర్మకు నల్గొండ కోర్టు ఉరిశిక్ష విధించింది. ప్రణయ్ హత్యలో సుభాష్ శర్మ కీలకపాత్ర పోషించాడు. సుభాష్ శర్మకు ఉరిశిక్ష విధిస్తూ నల్గొండ కోర్టు తీర్పు వెలువరించింది. ఇప్పటికే జైల్లో ముగ్గురు నిందితులు శిక్ష అనుభవిస్తున్నారు. ఉగ్రవాది అస్గర్ అలీకి సుపారీ ఇచ్చి ప్రణయ్‌ను అమృత తండ్రి హత్య చేయించాడు. ఏడుగురితో ఓ గ్యాంగ్‌ను అస్గర్ అలీ ఏర్పాటు చేశాడు. గుజరాత్ మాజీ హోంమంత్రి హరెన్ పాండ్యా హత్య కేసులో నిందితులతో కలిపి అస్గర్ అలీ గ్యాంగ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా.. పెరుమాళ్ల ప్రణయ్ హత్యకేసులో నల్లగొండ ఎస్సీ, ఎస్టీ జిల్లా సెషన్‌కోర్టు కీలక తీర్పు వెలువరించింది. 2018 సెప్టెంబర్ 14వ తేదీన హత్యకు ప్రణయ్ గురయ్యాడు. గర్భవతిగా ఉన్న భార్య అమృతను నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి.. తిరిగి వస్తుండగా.. దుండగులు ప్రణయ్‌పై కత్తులతో దాడి చేసి హతమార్చారు. తన కూతురిని కులాంతర వివాహం చేసుకున్నాడనే కక్షతో సుఫారీ గ్యాంగ్‌తో ప్రణయ్‌ను మారుతీరావు హత్య చేయించాడు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసుశాఖ అన్ని కోణాల్లో విచారణ పూర్తిచేసి 1600పేజీల్లో చార్జిషీట్ నివేదికను రూపొందించింది. అప్పటి ఎస్పీ ఏవీ రంగనాథ్ పర్యవేక్షణలో విచారణ పూర్తిచేసి హత్యకేసుల్లో ఎనిమిది మంది నిందితుల పాత్ర ఉందని నిర్ధారించి, 2019 జూన్ 12 వ తేదీన చార్జిషీట్ దాఖలు చేయగా నల్లగొండ ఎస్సీ, ఎస్టీ జిల్లా సెషన్ కోర్టు విచారణ మొదలుపెట్టింది. సుమారు 5సంవత్సరాల 9నెలల కాలం పాటు విచారణ కొనసాగగా, పోలీస్ శాఖ సమర్పించిన చార్జిషీట్ నివేదిక, పోస్టుమార్టం రిపోర్టు, సైంటిఫిక్ ఎవిడెన్స్‌లతో పాటు సాక్షులను న్యాయస్థానం విచారించి తుది తీర్పును ఈరోజు రిజర్వు చేసింది. ప్రణయ్ హత్యకేసులో ఏ1 తిరునగరు మారుతీరావు, ఏ2 బీహార్‌కు చెందిన సుభాష్‌శర్మ, ఏ3 అజ్గర్‌అలీ, ఏ4 అబ్దుల్‌బారీ, ఏ5 ఎం.ఏ కరీం, ఏ6 తిరునగరు శ్రవణ్‌కుమార్, ఏ7 శివ, ఏ8 నిజాం నిందితులుగా పోలీసులు కోర్టుకు సమర్పించిన చార్జిషీట్‌లో పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు మారుతీరావు(ఏ-1) 2020 మార్చిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ కేసులో నిందితుల పాత్రపై సాక్ష్యాధారాలను పరిగణించి శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం వెల్లడించింది. సుభాష్‌శర్మ (ఏ-2), అస్గర్‌అలీ(ఏ-3) విచారణ ఖైదీలుగా ఉన్నారు. మిగిలిన ఐదుగురు నిందితులు బెయిల్‌పై విడుదలై కోర్టు విచారణకు హాజరవుతున్నా విషయం తెలిసిందే.



## ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల కోసం

# నామినేషన్

(మొదటి పేజీ తరువాయి..)

ప్రకారం సీపీఐకి హస్తం పార్టీ కేటాయించింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీపీఐతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుని కొత్తగూడెం సీటును కేటాయించింది. అప్పుడు తమకు రెండు అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని సీపీఐ పట్టుబట్టింది. కానీ కొత్తగూడెం ఒకటే ఇచ్చి భవిష్యత్తులో ఎమ్మెల్సీ సీటు ఇస్తామని కాంగ్రెస్ సీపీఐకి హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే తాజాగా సీటును కేటాయించింది. ఇకపోతే బిఆర్ఎస్ నుంచి దాసోజ్ శ్రవణ్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట కెటిఆర్, హరీష్ రావు, తలసాని శ్రీనివాసయాదవ్ తదితరులు వచ్చారు. మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి తదితరులు కూడా హాజరయ్యారు. దాసోజు గతంలో గవర్నర్ కోటాలో నియిమితులయినా గవర్నర్ ఆలస్యంతో ఆగిపోయింది.ఐదుసీట్లకు ఐదుగురే నామినేషన్లు వేయడంతో ఏకగ్రీవం కానున్నాయి. ఎన్నికలు నిర్వహించే అవకాశం రాకపోవచ్చు. ఇదిలావుంటే అసెంబ్లీలో ప్రస్తుతమున్న ఎమ్మెల్యేల బలం ప్రకారం కాంగ్రెస్ పార్టీకి 4 ఎమ్మెల్సీ సీట్లు దక్కనున్నాయి. అయితే పొత్తులో భాగంగా ఒక ఎమ్మెల్సీ సీటును సీపీఐకి కేటాయించింది. ఒక్క ఎమ్మెల్సీకి 21 మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరం. ఇదిలా ఉంటే.. ఎమ్మెల్సీ టికెట్ మాజీ ఎంపీ విజయశాంతికి దక్కడం చర్చనీయాంశంగా మారింది. తొలి నుంచి ఎమ్మెల్సీ రేసులో రాములమ్మ పేరు లేదు. చివర్లో అనూహ్యంగా ఆమె పేరు తెరపైకి వచ్చింది. విజయశాంతి నేరుగా ఢిల్లీలోనే పార్టీ అగ్రనేతలతో చర్చలు జరిపి ఎమ్మెల్సీ టికెట్ సాధించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కోసం టికెట్ త్యాగం చేసిన వారికి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ హైకమాండ్ ప్రియారిటీ ఇచ్చింది. పార్టీ ఆదేశాల మేరకు అద్దంకి దయాకర్ తుంగతుర్తి అసెంబ్లీ టికెట్ వదులుకోగా.. విజయ శాంతి మెదక్ ఎంపీ టికెట్ రేసు నుంచి తప్పుకున్నారు. ఈ క్రమంలోనే వీరి త్యాగాలను గుర్తించిన అధిష్టానం.. ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చింది. సీపీఐ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లికంటి సత్యంను ఆ పార్టీ ప్రకటించింది. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించిన తర్వాత ఆయన పేరును రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటించారు.ప్రస్తుతం సీపీఐ నల్గొండ జిల్లా కార్యదర్శిగా, పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు.

# తెలంగాణలో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయ్

## అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరం

## అబద్ధాలతో పాలనను సాగించలేం

## ఫార్ములా కేసులో మళ్లీ నోటీసులు వచ్చే అవకాశం : కేటీఆర్

హైదరాబాద్,మార్చి10(నేటి ఫోకస్ న్యూస్):

అబద్ధాలతో పాలన ఎక్కువకాలం సాగించలేమని.. దానిని ప్రజలు గ్రహించినప్పుడు మూల్యం తప్పదని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణలో కచ్చితంగా ఉప ఎన్నికలు రాబోతున్నాయని తెలిపారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉన్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ సోమవారం నాడు నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తమకు ఉన్న బలంతోనే ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేస్తున్నామని తెలిపారు.



అప్పుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పదేపదే అబద్ధాలు చెబుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇంకా ఎన్నేళ్లు అబద్ధాలు చెబుతారని రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల తీరు కూడా అబద్ధాలు, బుకాయింపులతోనే సాగుతుందని ఆరోపించారు. ఫార్ములా ఈ కార్ రేసులో మళ్లీ తనకు నోటీసులు ఇస్తారని అభిప్రాయపడ్డారు. ఈ నెల 16వ తేదీన అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి.. 17వ తేదీన తనకు నోటీసులు ఇస్తారని అన్నారు. తనను విచారణకు పిలిచి నాటకాలు ఆడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్ రేసు ముమ్మాటికీ లొట్టపీసు కేసే అని పునరుద్ఘాటించారు. ఫార్ములా ఈ కార్ రేసుకు రూ.45 కోట్లు ఖర్చు చేస్తే తప్పు అని అన్నారని కేటీఆర్ అన్నారు. మరి అందాల పోటీలకు రూ.200 ఖర్చు ఎలా చేస్తారని ప్రశ్నించారు. మిస్ వరల్డ్ పోటీలతో రాష్ట్రానికి ఏం లాభం వస్తుందని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఈ మొగోడు ఒలింపిక్స్ పెడతానంటున్నాడని.. అందుకు రూ.లక్ష కోట్లు అవసరమవుతాయని తెలిపారు. బీసీలపై అంత ప్రేమ ఉంటే ఢిల్లీలో జంతర్ మంతర్‌లో కూర్చొని ఆమరణ దీక్ష చేయాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమీషన్లు తీసుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. కాంట్రాక్టర్లు భయపడి 20 శాతం తక్కువ చేసి చెబుతున్నారని తెలిపారు.




# గ్రూప్-1 పరీక్షల ఫలితాలు విడుదల

హైదరాబాద్,మార్చి10(నేటి ఫోకస్ న్యూస్):

ఎట్టకేలకు తెలంగాణ గ్రూప్-1 పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మెయిన్స్ పరీక్షల ప్రొవిజనల్ మార్కులను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. టీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అభ్యర్థులు లాగిన్ వివరాలతో మార్కులు చూసుకోవచ్చని పేర్కొంది. 563 పోస్టుల భర్తీ కోసం టీఎస్‌పీఎస్సీ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. గతేడాది అక్టోబర్ చివరివారంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగ్గా.. 21,093 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

# ఇంటర్నేషనల్ డ్రగ్ డీలర్ షెహనాజ్ సింగ్ అరెస్ట్

## వెల్లడించిన పంజాబ్ డిజిపి

చండీఘఢ్,మార్చి10(నేటి ఫోకస్ న్యూస్):

అమెరికా సహా పలు దేశాలకు మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న అంతర్జాతీయ డ్రగ్ డీలర్‌ను పంజాబ్ పోలీసులు పట్టుకున్నారు. ఎఫ్‌బీఐ మోస్ట్‌వాంటెడ్ జాబితాలో ఉన్న ఇంటర్నేషనల్ డ్రగ్ లార్డ్ షెహనాజ్ సింగ్ అలియాస్ షాన్ భిందెర్‌ను అరెస్టు చేసినట్లు పంజాబ్ డీజీపీ సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు. నార్కోటిక్స్ సిండికేట్‌లో అతడు కీలకంగా వ్యవహరిస్తున్నాడని, కొలంబియా నుంచి అమెరికా, కెనడాలోకి మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. షెహనాజ్ అక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టిన అమెరికా ఎఫ్‌బీఐ ఫిబ్రవరి 26న అతడి అనుచరులను అరెస్టు చేసింది. వారినుంచి 391 కేజీల మెథంఫెటమైన్, 109 కేజీల కొకైన్ సహా నాలుగు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామాలతో షెహనాజ్ భారత్‌కు పారిపోయి వచ్చాడు. దానిపై నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో పంజాబ్ తర్న్ తరణ్ పోలీసులు రహస్య ఆపరేషన్ చేపట్టారు. అతడి జాడను గుర్తించి తాజాగా అరెస్టు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వ్యవస్థీకృత నేరాల కట్టడికి తాము కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పేందుకు ఆ ఆపరేషన్ నిదర్శనమని పంజాబ్ పోలీసులు వెల్లడించారు. డ్రగ్ స్మగ్లర్లు, క్రిమినల్స్‌కు పంజాబ్ స్వర్గధామం కాదని హెచ్చరించారు.

# రాజధాని అమరావతిలో భూ కేటాయింపులు యధాతథం

## గతంలో ఉన్న విధాన్నే కొనసాగిస్తామన్న నారాయణ

## మంత్రలు కమటి సమావేశంలో పలు అంశాలపై చర్చ

అమరావతి,మార్చి10(నేటి ఫోకస్ న్యూస్):

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా చేసే భూకేటాయింపుల విషయంలో గతంలో ఉన్న విధానాన్నే కొనసాగిస్తామని మంత్రుల కమిటీ స్పష్టం చేసింది. రాజధాని అమరావతిలో సంస్థలకు భూకేటాయింపులపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ నేతృత్వంలో మంత్రుల కమిటీ సమావేశమైంది. రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, టీజీ భరత్, కందుల దుర్గేశ్ సమావేశానికి హాజరయ్యారు. భేటీ అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. 'గతంలో 131 మందికి భూములు కేటాయించాం. వాటిలో 31 సంస్థలకు చేసిన కేటాయింపులను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నాం. రెండు సంస్థలకు గతంలో కేటాయించిన విధంగా కాకుండా వేరే చోట కేటాయింపులు చేయాలని నిర్ణయించాం. 16 సంస్థలకు స్థలంతోపాటు పరిధిని మార్చాం' అని మంత్రి తెలిపారు.'201419లో రాజధాని నిర్మాణం కోసం రైతులు దాదాపు 34వేల ఎకరాలు ఇచ్చారు. రూ.43 వేల కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచాం. రాజధాని పరిధిలో రహదారుల నిర్మాణాలు కూడా చేపట్టాం. సుమారు రూ.9వేల కోట్లు ఖర్చు చేశాం. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంతా మారిపోయింది. కక్ష సాధింపుతో మూడు ముక్కలాటలాడి రాజధాని నిర్మాణాన్ని పక్కన పడేశారు. ఏపీ రాజధాని అమరావతే అని ఎన్నికలకు ముందు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం చెప్పడంతో అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వంలో మేం దీనిపై దృష్టి సారించాం. దాదాపు 8 నెలలు కష్టపడి అనేక న్యాయపరమైన చిక్కులను పరిష్కరించాం. రూ.48 వేల కోట్లకు టెండర్లు పిలిచాం. వాటిని ఓపెన్ చేశాం. రెండు రోజుల్లో అగ్రిమెంట్ ప్రక్రియ కూడా పూర్తవుతుంది. ఆ వెంటనే ఆయా సంస్థలు పనులు ప్రారంభిస్తాయి' అని మంత్రి తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో తీర్పు వాయిదా

హైదరాబాద్,మార్చి10(నేటి ఫోకస్ న్యూస్):

ఫోన్ ట్యాపింగ్ కేసుపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ముందస్తు బెయిల్ కోరుతూ రాధాకిషన్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. తీర్పును కోర్టు వాయిదా వేసింది. గతంలో చక్రధర్‌గౌడ్ ఫిర్యాదుతో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్‌పై పంజాగుట్టలో నమోదైన రెండో ఎఫ్ఐఆర్‌పై ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని రాధాకిషన్ రావు వేసిన పిటిషన్‌పైన సుదీర్ఘ వాదనల తర్వాత ఈరోజు వాదనలు ముగిశాయి. తీర్పును న్యాయస్థానం వాయిదా వేసింది. చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాధాకిషన్‌రావుతో పాటు మాజీ మంత్రి హరీష్ రావు సహా పలువురిపై కేసు నమోదు అయ్యింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ రాధాకిషన్ రావు తన వాదనలు వినిపించారు. కానీ ముందస్తు బెయిల్ ఇవ్వొద్దంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. ఈ కేసులో విచారణ జరపాలని, చాలా ఆధారాలను సేకరించాల్సి ఉంటుందని, కీలక అంశాలు వెలుగులోకి రావాలని ఈ క్రమంలో రాధాకిషన్‌కు బెయిల్ ఇవ్వొద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనలు వినిపించారు. ఇరు వాదనలు విన్న కోర్టు తీర్పును వాయిదా వేసింది. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసు మొదటి ఎఫ్ఐఆర్‌లో జ్యుడిషియల్ రిమాండ్ నుంచి కొద్దిరోజుల




క్రితమే రాధాకిషన్ బెయిల్‌పై బయటకు వచ్చారు. దీంతో రెండో కేసుకు సంబంధించి తనకు బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు పూర్తి కాగా.. న్యాయస్థానం తీర్పు ఎలా ఉండబోతంది అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

# క్యాబ్ తరహా అంబులెన్స్ సేవలు

## కొత్త తరహా సేవలకు జెన్జో శ్రీకారం

ముంబయి,మార్చి10(నేటి ఫోకస్ న్యూస్):

క్యాబ్ సర్వీసుల్లానే అంబులెన్స్ సర్వీలసులు కూడా అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఇక దేశంలో అత్యవసర సమయాల్లో అంబులెన్సుల కోసం ఎదురుచూడాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ సర్వీస్ ప్రొవైడర్ జెన్జో.. కొత్త తరహా సేవలకు శ్రీకారం చుట్టింది. క్యాబ్ తరహాలో కాల్ చేసిన 15 నిమిషాల్లోనే అంబులెన్సు సదుపాయాన్ని కల్పించేందకు 450 నగరాల్లో 25 వేల ప్రైవేటు అంబులెన్సులను ప్రారంభించింది. అత్యవసర సమయాల్లో స్పందించే తీరు, ప్రథమ చికిత్స, సీపీఆర్ శిక్షణ అందించేందుకు జొమాటో సహా ఇతర ఇ-కామర్స్ సంస్థలతో జట్టు కట్టినట్లు జెన్జో తెలిపింది. సాధారణంగా డెలివరీ సిబ్బందే ముందుగా స్పందిస్తుంటారని, అందుకే వారికి ప్రాణాలను కాపాడే పద్ధతులపై అవగాహన కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. డిజిటల్ టెక్నాలజీ సాయంతో మెడికల్ ఎమర్జెన్సీ సేవల మౌలిక సదుపాయాలను అందించడమే తమ లక్ష్యమని జెన్జో సహ వ్యవస్థాపకులు, సీఈఓ శ్వేత మంగళ్ తెలిపారు. ఇందుకోసం జాతీయ స్థాయిలో 1800 102 1298 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ఒకే తరహా ఛార్జీల విధానం ఉంటుందని పేర్కొన్నారు. తొలి 5 కిలోమీటర్లకు బేసిక్ అంబులెన్సు ధర రూ.1500గా నిర్ణయించినట్లు తెలిపారు. ఆపై ప్రతి కిలోమీటరుకు రూ.50 చొప్పున చెల్లించాల్సి ఉంటుదన్నారు. కార్డియాక్ అంబులెన్స్‌కు తొలి 5 కిలోమీటర్లకు రూ.2500, ఆపై కిలోమీటరుకు రూ.100 చొప్పున చెల్లించాలని కంపెనీ చెప్పారు. దేశంలో ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు బలోపేతం చేసేందుకు ఆస్పత్రులు, స్థానిక అధికారులు, కార్పొరేట్, ప్రైవేటు అంబులెన్సులతో జట్టుకట్టినట్లు కంపెనీ తెలిపింది. ఆయా అంబులెన్సుల్లో అత్యవసర సమయాల్లో అవసరమయ్యే ప్రాణ రక్షక పరికరాలతో పాటు, శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉంటారని జెన్జో పేర్కొంది. డిమాండ్‌ను బట్టి అంబులెన్సులు జోడిస్తామని, మరిన్ని నగరాలకు విస్తరిమస్తామని కంపెనీ తెలిపింది.

# రూ.1.95 లక్షల కోట్ల పన్ను ఎగవేత

## ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడి

న్యూఢిల్లీ,మార్చి10(నేటి ఫోకస్ న్యూస్):

ఈ ఆర్థిక సంవత్సరానికి గాను జనవరి నెల వరకు రూ.1.95 లక్షల కోట్ల పన్ను ఎగవేతలు గుర్తించామని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్ సభలో వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను జనవరి వరకు.. 25,397 పన్ను ఎగవేత కేసులు నమోదయ్యాయని తెలిపారు మంత్రి. గత ఐదు సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వ అధికారులు గుర్తించిన మొత్తం జీఎస్టీ ఎగవేత కేసుల సంఖ్య 86,711గా ఉందని.. వీటి మొత్తం విలువ రూ.6.79 లక్షల కోట్లకు పైగా ఉందని మంత్రి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి వరకు, నమోదైన ఎగవేత కేసుల సంఖ్య 25,397 కాగా.. మొత్తం విలువ రూ.1,94,938 కోట్లుగా ఉందని మంత్రి తెలిపారు. అదే సమయంలో, పన్ను ఎగవేత కేసులలో రూ.21,520 కోట్ల వాలంటరీ డిపాజిట్ అయ్యిందని తెలిపారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఐటీసీ మోసాల కేసులు 13,018 కాగా.. వీటి మొత్తం విలువ రూ.46,472 కోట్లుగా ఉందని తెలుస్తోంది. వీటిలో రూ.2,211 కోట్ల వాలంటరీ డిపాజిట్ జరిగిందని తెలిపారు మంత్రి పంకజ్ చౌదరి. జీఎస్టీ ఇన్వెస్టిగేషన్ వింగ్ డేటా ప్రకారం, 2023-24 ఆర్థిక సంవత్సరంలో, 20,582 ఎగవేత కేసులు నమోదు కాగా.. వీటి మొత్తం విలువ రూ.2.30 లక్షల కోట్లు అని తెలుస్తోంది.

2022-23 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ ఎగవేత విలువ రూ. 1.32 లక్షల కోట్లు కాగా.. 2021-22లో రూ. 73,238 కోట్లు, 2020-21లో రూ. 49,384 కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జీఎస్టీ పన్ను ఎగవేతలు నివారించడానికి కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పంకజ్ చౌదరి అన్నారు.

# శ్రీకాకుళంలో ఫిషింగ్ హార్బర్, రెండు ఫిషింగ్ జెట్టీలు

## నౌకాయాన శాఖ మంత్రి శరబానంద సోనోవాల్÷-కు రామ్మోహన్ లేఖ

న్యూఢిల్లీ,మార్చి10(నేటి ఫోకస్ న్యూస్):

శ్రీకాకుళం జిల్లాలో ఫిషింగ్ హార్బర్, రెండు ఫిషింగ్ జెట్టీలు ఏర్పాటు చేయాలని కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి శరబానంద సోనోవాల్‌ను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ మేరకు లేఖ రాశారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో 197 కి.మీ మేర తీర ప్రాంతం ఉందన్నారు. ఇక్కడి గ్రామాల ప్రజలు మత్స్య సంపద పైనే ఆధారపడి ఉన్నందున ఫిషింగ్ హార్బర్, జెట్టీలు ఏర్పాటు చేయాలని లేఖలో కోరారు. సంతబొమ్మాలి మండలం భావనపాడు గ్రామం వద్ద మత్స్య నౌకాశ్రయం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.'వజ్రపుకొత్తూరు మండలంలోని మంచినీళ్లపేట, గార మండలంలోని కళింగపట్నం వద్ద ఫిషింగ్ జెట్టీలు ఏర్పాటు చేయాలి. 230కి పైగా గ్రామాల్లో మత్స్యకారులు నివసిస్తున్నారు. చేపలు పట్టేందుకు సరైన వసతులు లేకపోవడంతో ఉపాధి లేక వేరే రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. స్థానికంగా ఉద్యోగ, ఉపాధి కల్పన జరగాలంటే సరైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. అందుకోసం ఫిషింగ్ హార్బర్, ఫిషింగ్ జెట్టీలు ఏర్పాటు చేయాలి. దీని ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ మెరుగవుతుంది. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు వలసలు తగ్గిపోతాయి' అని రామ్మోహన్ నాయుడు లేఖలో పేర్కొన్నారు.

# ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లు

## నేడు నామినేషన్ల పరిశీలన..13న ఉపసంహరణ

## రెండు తెలుగు రాష్ట్రాల్లో పది స్థానాలకు పోటీ

## పోటీ లేకపోవడంతో ఏకగ్రీవం అయ్యే అవకాశం

హైదరాబాద్/అమరావతి,మార్చి10(నేటి ఫోకస్ న్యూస్):

రెండు తెలుగు రాష్ట్రాల్లో మార్చి 20న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ క్రమంలో ఆయా పార్టీలు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. స్వీకరణకు చివరి తేదీ కావడంతో ఆయా పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. దీంతో నామినేషన్ల పక్రియ పూర్తి అయ్యింది. తెలంగాణలోని 5, ఆంధ్రప్రదేశ్‌లోని 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. మంగళవారం నామినేషన్ల పరిశీలన జరుగనుంది.

నామినేషన్లను పరిశీలించాక, ఈ నెల 13న నామినేషన్‌ల ఉపసంహరణకు చివరి తేదీ. అయితే విపక్షం నుంచి పోటీ లేనందున ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. తెలంగాణలో ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, మిర్జా రియాజుల్ హసన్ పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. ఇందులో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఎ÷-గగె మల్లేశం గత ఏడాదే కాంగ్రెస్‌లో చేరారు. మిర్జా రియాజుల్ హసన్ మజ్లిస్ నేత కాగా, మిగిలిన ముగ్గురు బీఆర్ఎస్ నేతలు. అటు ఏపీలో జంగా కృష్ణమూర్తి, దువ్వారపు రామారావు, బీటీ నాయుడు, అశోక్‌బాబు, యనమల రామకృష్ణుడుల పదవీకాలం ఈ నెల 29తో ముగియనుంది. దీంతో తెలంగాణలో ఐదు, ఏపీలో ఐదు స్థానాలకు ఇప్పటికే నోటిషన్ విడుదలైంది. ఏపీలో ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో జనసేన తరపున నాగబాబు, టీడీపీ తరపున బీటీ నాయుడు, బీద రవిచంద్ర యాదవ్, కావలి గ్రీష్మ, బీజేపీ అభ్యర్థిగా సోము వీర్రాజు పేర్లను ఖరారు చేశారు. ఇప్పటికే నాగబాబు నామినేషన్ వేయగా.. మిగిలిన నలుగురు అభ్యర్థులు ఈరోజు అసెంబ్లీ కమిటీ హాలులో నామినేషన్ వేశారు. పొత్తులో భాగంగా ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండింటిలో జనసేన, బీజేపీ అభ్యర్థులు బరిలో దిగారు. ఇక మిగిలిన మూడు స్థానాల్లో ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల నడుమ సమతూకం పాటిస్తూ చంద్రబాబు ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేశారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండింటిని బీసీలకు కేటాయించగా.. ఒక స్థానాన్ని ఎస్సీ మహిళకు ఇచ్చింది. తెలుగుదేశం తరపున ఎమ్మెల్సీలుగా కావలి గ్రీష్మ, బీదా రవిచంద్ర యాదవ్, బీటీ నాయుడు అసెంబ్లీ ఆవరణలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. అభ్యర్థులకు మద్దతుగా నారా లోకేష్, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్, విష్ణుకుమార్ రాజు, రఘురామకృష్ణంరాజు, పితాని సత్యనారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పల్లా శ్రీనివాస్, టీడీ జనార్దన్, కురుగొండ్ల రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి తదితరులు వచ్చారు. అలాగే అసెంబ్లీ కమిటీ హాల్లో బీజేపీ అభ్యర్థి సోమివీర్రాజు నామినేషన్ దాఖలు చేశారు.

తెలంగాణలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు గాను మూడు స్థానాల్లో కాంగ్రెస్ తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతి పేర్లు ఖరారయ్యాయి. పొత్తులో భాగంగా సీపీఐకి ఒక స్థానాన్ని కేటాయించింది. సీపీఐ తరఫున నెల్లికంటి సత్యాన్ని బరిలోకి దిగారు. వీరంతా నేడు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, సీపీఐ నేతలు హాజరయ్యారు. అలాగే బీఆర్ఎస్ తన అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ కుమార్ పేరును ఖరారు చేయడంతో ఆయన నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు పాల్గొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నామినేషన్లను తిరస్కరించనున్నారు. 13న ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుండగా.. ఆ తర్వాత అధికారికంగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ప్రకటించనుంది.

# కేంద్రీయ విద్యాయాల్లో ఎంపిల కోటా పునరుద్ధరించేది లేదన్న కేంద్రమంత్రి

న్యూఢిల్లీ,మార్చి10(నేటి ఫోకస్ న్యూస్):

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు పార్లమెంటు సభ్యులకు గతంలో ఇచ్చిన కోటాను పునరుద్ధరించే ప్రతిపాదన లేదని కేంద్రం తేల్చి చెప్పింది. లోక్‌సభలో జేడీయూ ఎంపీ రాంప్రీత్ మండల్ అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తూ బదిలీ అయ్యే ఉద్యోగుల పిల్లల విద్యావసరాలను తీర్చేందుకు కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా దేశవ్యాప్తంగా ఒకేరకమైన విద్య అందుతుంది. అయితే, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఈ ప్రవేశాల్లో ఉండే ఎంపీ కోటా సహా పలు ప్రత్యేక ప్రొవిజన్లను గతంలో ఉపసంహరించుకుంది. ఈ ప్రత్యేక కోటాలు తరగతి గది సంఖ్యకు మించి ఉండటంతో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి అధికంగా ఉండేది. అందువల్ల తరగతి గదిలో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి ఆరోగ్యకరంగా ఉండేలా చూడటం, వ్యవస్థలో గుణాత్మక మార్పు తీసుకురావాలన్న జాతీయ విద్యా విధానం లక్ష్యానికి అనుగుణంగా ఉత్తమ అభ్యాసన ఫలితాలు సాధించేందుకు ఈ కోటాలను తొలగించారు. ప్రస్తుతం ఈ కోటాను పునరుద్ధరించే ప్రతిపాదన ఏదీ కేంద్రం వద్ద లేదు' అని విద్యాశాఖ మంత్రి పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు విద్యార్థులను సిఫార్సు చేసే పలు ప్రత్యేక కోటాలను కేంద్రం 2022 ఏప్రిల్‌లో రద్దు చేసింది.

# పన్నులు తగ్గించాలని కోరకండి

## అలా చేస్తే సంక్షేమం ఆగిపోతుంది

## పారిశ్రామ వర్గాలకు నితిన్ గడ్కరీ సూచన

న్యూఢిల్లీ,మార్చి10(నేటి ఫోకస్ న్యూస్):

జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయొద్దని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పరిశ్రమ వర్గాలకు సూచించారు. పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ప్రభుత్వానికి నిధులు అవసరం అన్నారు. కాబట్టి..జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయొద్దని కోరారు. ఒకవేళ పన్నులు తగ్గిస్తే.. మరింత తగ్గించాలని కోరతారని, ఇది మనుషుల మనస్తత్వమని ఆయన వ్యాఖ్యానించారు. తాము కూడా పన్నులు తగ్గించడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నామని..కానీ దాని వల్ల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ధనవంతుల నుంచి పన్నులు వసూలు చేసి..పేదల అవసరాలకు వినియోగించడం ప్రభుత్వ దార్శనికత అని మంత్రి అన్నారు. దేశంలో లాజిస్టిక్స్ ఖర్చు రెండేళ్లలోపు 9 శాతానికి తగ్గుతుందని పరిశ్రమ వర్గాలకు మంత్రి హామీ ఇచ్చారు. చైనాలో లాజిస్టిక్స్ ఖర్చు 8 శాతం ఉండగా.. యూఎస్, ఐరోపా దేశాల్లో 12 శాతం ఉందని తెలిపారు. మూలధన పెట్టుబడులను పెంచడం ద్వారా భవిష్యత్తులో దేశంలో మరిన్ని ఉద్యోగాలను సృష్టించవచ్చన్నారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి దిగుమతులను తగ్గించి ఎగుమతులను పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# సినిమాల్లోకి రాకపోయి ఉంటే.. రాజకీయాల్లోకి వచ్చేవాడిని..

- కిరణ్ అబ్బవరం -

తాను నటుడిని కాకపోయి ఉంటే పాలిటిక్స్‌లోకి వెళ్లేవాడినని తెలిపాడు యువ నటుడు కిరణ్ అబ్బవరం. 'క' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న కిరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రుబా'. ఈ సినిమాకి విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తుండగా.. రవి, జోజో, జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. రుక్సర్ థిల్లాన్ కథానాయికగా నటిస్తుండగా.. మార్చి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్‌కి సంబంధించి వరుస ఇంటర్వ్యూలలో పాల్గొంటున్నాడు కిరణ్. అయితే ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా తన జీవితంలోని ఆసక్తికర విషయాలను కూడా కిరణ్ తాజాగా పంచుకున్నాడు. సినిమాలకు రాకముందు జీవితంలో ఏదోకటి పెద్దగా సాధించాలనే కోరిక ఎప్పుడు ఉండేది. అందులో భాగంగానే హీరో అవ్వాలి అనుకున్నాను. అయితే నాకు రాజకీయాలు అంటే చాలా ఇష్టం. రాయాలసీమకి చెందిన వ్యక్తిగా రాజకీయాలను చిన్ననాటి నుంచి దగ్గరిగా చూశాను. ఒకవేళ నేను సినిమా హీరో కాకపోయి ఉంటే ఖచ్చితంగా రాజకీయాల్లోకి వెళ్లేవాడిని. మంచి చెడుని పక్కనపెట్టి ప్రజలతో కలవడం నాకు ఇష్టం. దాని వల్లనే నాకు రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. అలాగే భవిష్యత్తులో నేను వ్యాపార రంగంలో కూడా అడుగు పెట్టాలని ప్లాన్ చేస్తున్నాను. ప్రత్యేకంగా, రాయలసీమ స్టైల్‌లోని ఆహారాన్ని అందరికీ అందించాలని కోరుకుంటున్నా. దానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పుడు చేస్తున్నాను, త్వరలోనే దాన్ని ప్రకటించనున్నాను అని కిరణ్ అబ్బవరం తెలిపారు.



## మీ అంచనాలు అందుకోకుంటే

# నా సినిమా చూడొద్దు: నాని

నా 16ఏళ్ల సినీ కెరీర్‌లో 'దయ చేసి ఈ సినిమా చూడండి' అని నేనెప్పుడూ అడిగింది లేదు. కానీ, ఈ చిత్ర విషయంలో ఆ మాట అడుగుతున్నా. ఎందుకంటే ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులెవరూ మిస్సవ్వకూడదని నా కోరిక. ఇది మీ అంచనాలను అందుకోలేదు అనిపిస్తే రెండు నెలల్లో విడుద కానున్న నా 'హిట్ 3'ని ఎవరూ చూడొద్దు అని నాని అన్నారు. ఆయన సమర్పణలో ప్రియ దర్శి ప్రధాన పాత్ర నటించిన చిత్రం 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. రామ్ జగదీశ్ తెరకెక్కించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించారు. ఈ నెల 14న థియేటర్లలో విడుదల కానుంది. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ వేడుకలో ఈ చిత్ర ట్రైలర్‌ను నాని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి, నాగ్ అశ్విన్, ప్రశాంత్ వర్మ, శ్రీకాంత్ ఓదెల, శైలేశ్ కొలను, శౌర్యువ్ తదితరులు పాల్గొన్నారు. నాని మాట్లాడుతూ.. ఈ రోజుల్లో సినిమాల్లోకి దూరిపోయి.. అందులోని పాత్రలకు ఎమోషన్‌తో కనెక్ట్ అయిపోయి.. వాటితోపాటు నవ్వి, ఏడ్చి.. ఆ చిత్ర ప్రపంచంలోకి తీసుకెళ్లే కథలు బాగా తగ్గిపోయాయి. కానీ, అలాంటి అనుభూతిని 'కోర్ట్'తో నేను పొందగలిగాఅని అన్నారు.



# ఆ బాధ ఇప్పటికీ ఉంది..

నేడు మహిళ దినోత్సవం సందర్భంగా మెగా ఫ్యామిలీ అంతా ఒక్కదగ్గరే చేరింది. మెగా వుమెన్స్ పేరుతో ఒక ఇంటర్వ్యూలో విడుదల కాగా.. ఈ ఇంటర్వ్యూలో మెగాస్టార్ చిరంజీవితో పాటు అతడి అమ్మ అంజనాదేవి తమ్ముడు నాగబాబు, చెల్లెల్లు పాల్గొన్నారు. ఇందులో మెగా కుంటుంబంకి సంబంధించిన ఎన్నో విషయాలను చిరుతో పాటు అంజనాదేవి తదితరులు పంచుకున్నారు. అయితే ఈ ఇంటర్వ్యూలో చిరు మాట్లాడుతూ.. తన చెల్లి చనిపోయిన క్షణం ఇప్పటికీ గుర్తుకువస్తుందంటూ ఎమోషనల్ అయ్యాడు. అమ్మకు మేము ఐదుగురు సంతానం. అయితే మరో ముగ్గురు తోబుట్టువులు నా చిన్నతనంలోనే చనిపోయారు. నాన్న ఉద్యోగంలో బిజీగా ఉన్న సమయంలో అమ్మనే ఇంట్లో అన్ని పనులు చూసుకోవడంతో పాటు గృహిణిగా అన్ని బాధ్యతలు తన మీదే ఉండేవి. దీంతో చిన్ననాటి నుంచి తనకు సాయం చేసేవాడిని. అయితే నేను ఆరో తరగతి చదువుతున్న సమయంలో నాకు రమ అనే సోదరి ఉండేది. ఒకసారి సడన్‌గా జబ్బుపడింది. దీంతో నేను అమ్మ కలిసి తనను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాం. నాన్నకి ఈ విషయం తెలియదు. ఆసుపత్రిలో ఉండగానే రమ కన్నుమూసింది. దీంతో తనను చేతుల్లో ఎత్తుకుని ఇంటికి తీసుకెళ్లాను. ఇంటి చుట్టుపక్కల ఉన్నవారు సాయం చేయడంతో రమ అంతక్రియలు పూర్తి చేశాం. అయితే ఈ విషయం నాన్నకి తర్వాత తెలిసింది. తాను వచ్చేవరకు అంతా అయిపోయింది. కానీ ఆ క్షణాలు నాకు ఇప్పటికీ కూడా గుర్తున్నాయి వాటికి తలచుకున్నప్పుడల్లా ఎమోషనల్ అవుతుంటా అంటూ చిరు చెప్పుకోచ్చాడు.



# జటాధరలో సోనాక్షి సిన్హా..

తెలుగు సినిమాల్లో నటించేందుకు బాలీవుడ్ తారలు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రియాంకా చోప్రా, అలియాభట్, దీపికా పదుకొణె, జాన్వీకపూర్, అనన్యపాండే వంటి భామలు ఇప్పటికే తెలుగు సినిమాల్లో నటించి అలరించారు. ఇప్పుడు వీరి జాబితాలో సోనాక్షి సిన్హా చేరారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌లతో బీటౌన్‌లో హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు సోనాక్షి. ఇటీవల 'హీరామండి'తో అలరించిన ఆమె టాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యారు. సుధీర్‌బాబు హీరోగా నటిస్తోన్న 'జటాధర'తో ఆమె తెలుగులోకి అడుగుపెడుతున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్రబృందం శనివారం పోస్టర్ విడుదల చేసింది. ప్రస్తుతం ఇది ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. పాన్ ఇండియా సినిమాగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమవుతోంది. 'శాస్త్రీయ, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్స్‌కు చెందిన ప్రపంచాల్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతి పొందుతారని సుధీర్‌బాబు తెలిపారు.





# ఫుల్ టైం టాలీవుడ్‌కు టైం కేటాయిస్తున్న బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్..

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా ఫ్యాన్స్ తలచుకుంటే ట్రెండింగ్‌కి కొదవా అన్నట్టుంది పరిస్థితి. నిన్నటి నుంచి ఏక్‌ధమ్ ట్రెండ్ అవుతూనే ఉన్నారు జాన్వీ కపూర్. ఇంతగా ట్రెండ్ కావడానికి బర్త్ డే సెలబ్రేషన్స్ మాత్రమే రీజనా.. అంటే.. అదేంటి గురూ అలా అంటున్నారు.. నెక్స్ట్ టాలీవుడ్‌ని ఏలేది ఆ అమ్మాయే అని అంటున్నారు ఫ్యాన్స్. చుట్టమల్లే చుట్టేసింది మన జాన్వీ కపూర్. మొన్న మొన్నటిదాకా బాలీవుడ్‌కే పరిమితమైనా.. ఏనాడూ ఆమెని పొరుగమ్మాయిలా చూడలేదు మనవాళ్లు. తెలుగు సినిమాలు చేసేయ్ అమ్మా అని బుజ్జగిస్తూనే ఉన్నారు. ఆ మాటలు విన్న శ్రీదేవి తనయ దేవరతో ఎంట్రీ ఇస్తే సినిమా బ్లాక్‌బస్టర్ టాక్ తెచ్చుకుంది. దేవరలో జాన్వీని చూసి మా తంగం అనుకున్నారంతా. దేవర సెకండ్ పార్టు కోసం ఆల్రెడీ 2026లో కాల్షీట్ కేటాయించేశారు ఈ బ్యూటీ. ఇప్పుడు మాత్రం రామ్‌చరణ్ సినిమా షూటింగ్‌తో యమా బిజీగా ఉన్నారు. ఈ సినిమా నుంచి వచ్చిన జాన్వీ లుక్ అదిరిందంటున్నారు అభిమానులు. ఆర్సీ 16 షూట్ కంప్లీట్ కాగానే అల్లు అర్జున్ - అట్లీ సినిమా యూనిట్‌తో జాయిన్ అవుతారట శ్రీదేవి తనయ. ఐకాన్ స్టార్ పక్కన అద్భుతమైన రోల్ కుదిరిందంటూ హ్యాపీగా ఉన్నారట జాన్వీ. డ్యాన్సుల్లో బన్నీని ఈక్వెల్ చేయడానికి ఇప్పటి నుంచే కాసింత స్పెషల్‌గా శ్రద్ధ పెడుతున్నారట. తెలుగులో ఒకటికి మూడు సినిమాలు చేతిలో ఉన్నాయి జాన్వీకి. ముగ్గురు లీడింగ్ హీరోల మూవీస్‌లో చేస్తున్నారు. సో, అడపాదడపా బాలీవుడ్ మూవీస్ చేసినా, ఫుల్ టైమ్ తెలుగుకే అలాట్ చేసేయాలని ఫిక్స్ అయిపోయినట్టున్నారు సిల్వర్‌స్క్రీన్ తంగం.